క్లుప్తంగా

బీఆర్ఎస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిన్నయ్య

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చాకేపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామానికి చెందిన 45మంది బీఆర్ఎస్‌లో చేరగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా చిన్నయ్య మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరి అభ్యున్నతి కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తోందని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యపడుతుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ శ్రమించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్, సర్పంచ్ సురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గణేష్ గౌడ్, నాయకులు లక్ష్మణ్, రవి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అడవిబాట.. పూలవేట!



అడవిలో తంగేడు పూలు తెంపుతూ..

దండేపల్లి: ఆడపడుచుల బతుకమ్మ ఆటకోసం అన్నలు, తమ్ములు పూల కోసం అడవి బాట పట్టారు. మండలంలో ఆదివారం సద్దుల బతుకమ్మ వేడుకలు నిర్వహించనున్నారు. ఇందుకోసం మండలంలోని ప లు గ్రామాల యువకులు, తంగేడు పూల కోసం శనివారం అడవికి వెళ్లి పూలు సేకరించి తెచ్చారు.

ఫుట్‌బాల్ పోటీలు



గెలుపొందిన క్రీడాకారులకు ట్రోఫీ అందజేస్తూ..

చెన్నూర్‌రూరల్: ఫాదర్ టోనీ బ్రదర్ బీజో స్మారకార్థం మండలంలోని బావురావుపేట గ్రామంలోని ఆస్సిసి ప్రయివేటు పాఠశాలలో శనివారం ఇంటర్ స్కూల్ ఫుట్‌బాల్ పోటీలను నిర్వహించారు. ఇందులో జైపూర్‌లోని సోషల్ వెల్ఫేర్ పాఠశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి మొదటి స్థానంలో నిలువగా వారికి రూ.10వేల నగదు, బెల్లంపల్లిలోని సెయింట్ మేరీ పాఠశాలకు ద్వితీయ బహుమతి రూ.5వేలు, బీజాపూర్‌లోని తోమస్ పాఠశాలకు తృతీయ బహుమతి లభించింది. వీటితో పాటు ట్రోఫీలను అందజేశారు. కార్యక్రమంలో ఫాదర్లు అనీష్, అంటోని అల్ఫోన్స్, ఫాదర్ మాత్యూ పైగడాచ, ఫాదర్ ఆనంద్ పాల్గొన్నారు.

నిర్భయంగా ఓటు వేయాలి

జన్నారం: మండలంలోని దొంగపల్లి గ్రామంలో లక్సెట్టిపేట సీఐ కృష్ణ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎవరైన అపరిచిత వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కొత్త వ్యక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దన్నారు. అనంతరం చిన్నారులకు బూట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సై సతీశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం



ఆర్థికసాయం చేస్తున్న మిత్రులు

దండేపల్లి: మండలంలోని మేదరిపేటకు చెందిన కర్నె శ్రీనివాస్ భార్య అనారోగ్యంతో బాధపడుతుంది. అతడు నిరుపేద కావడంతో, అతడి భార్య వైద్య ఖర్చుల కోసం దండేపల్లి ఉన్నత పాఠశాలలో 1984–85లో శ్రీనివాస్‌తో కలిసి పదోతరగతి చదివిన మిత్రులంతా రూ.24,500నగదును జమచేసి శనివారం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు అక్కల తిరుపతి, గోలి రవీందర్, బోయిడి శేషాద్రి, బొలిశెట్టి భూపతి, ఎస్ కిషన్, కట్ట రాజమౌళి, బోడకుంట సుధాకర్, నర్సయ్య, అంజయ్య పాల్గొన్నారు.

పరామర్శ

భీమారం: మండల కేంద్రంలోని ముదిరాజ్ కాలనీలో డెంగీ జ్వరాలతో బాధపడుతున్న వారిని శనివారం మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. మధుతో పాటు మరికొందరి ఆరోగ్యం గురించి వాకాబు చేశారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మండల పార్టీ అధ్యక్షుడు కలగూర రాజ్‌కుమార్, మాజీ జెడ్పీటీసీ జర్పుల రాజ్ కుమార్, ముదిరాజ్ సంఘం నాయకులు కొమురయ్య పాల్గొన్నారు.

దసరా జోష్..!

బతుకమ్మ, దసరా పండుగలు పురస్కరించుకుని వ్యాపార సముదాయాలు ప్రజలతో కిక్కిరిసిపోతున్నాయి. పూలకు డిమాండ్ ఉంది. రావణాసుర వధకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వివరాలతో ప్రత్యేక కథనం..

- జోరుగా సాగుతున్న వ్యాపారాలు
- పూల విక్రయాలకూ భలే డిమాండ్



బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రం బెల్లంపల్లిలో దసరా వ్యాపారం జోరుగా సాగుతోంది. ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు దుకాణాలన్నీ కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. ప్రత్యేకించి వస్త్ర దుకాణాలు, కంగన్‌హాల్స్, ఫుట్‌వేర్, రెడీమేడ్ వస్త్రాల షాపులు జోష్‌గా కనిపిస్తుండగా అంతే స్థాయిలో పూల వ్యాపారం జరుగుతోంది. పండుగలన్నింటీలో దసరా ఎంతో ప్రత్యేకమైంది. దసరా పండుగకు ఒకరోజు ముందుగా సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తున్న సంప్రదాయం. ఆ రెండు వేడుకలను కన్నుల పండువగా జరుపుకోవడానికి ప్రజలు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. పర్వదినాల వేళ నూతన వస్త్రాలు ధరించి, అలంకరించుకోవడానికి పెద్ద పీట వేస్తారు. ఆ క్రమంలోనే వస్త్రాల షాపులన్నీ గడిచిన వారం రోజుల నుంచి సందడిగా కనిపిస్తున్నాయి. బెల్లంపల్లితో పాటు చుట్టు పక్క ప్రాంతాల ప్రజలు వచ్చి బట్టలు కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు. ఈ క్రమంలో కాంటా చౌరస్తా నుంచి పాత బస్టాండ్ వరకు ఉన్న దుకాణాలన్నీ జోష్‌గా కనిపిస్తున్నాయి. రోజువారీగా బట్టలు, ఇతర అన్ని రకాల వ్యాపారం రూ.కోట్లలో సాగుతున్నట్లు వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి.

జోరుగా పూల విక్రయాలు...

సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తోంది. తొమ్మిది రోజులు బతుకమ్మ వేడుకలు అట్టహాసంగా జరుగుతాయి. సద్దుల బతుకమ్మతో సంబురాలు ముగుస్తాయి. పూల పండుగ కావడంతో రకరకాల పూలు తెచ్చి అమ్మకానికి పెట్టడంతో మహిళలు ఇష్టపూర్వకంగా కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకు వెళ్తున్నారు. ఫుట్‌పాత్‌పై వీధి వ్యాపారులు రాశులుగా పోసి పూల విక్రయాలు చేస్తున్నారు. బట్టల వ్యాపారం మాదిరిగానే పూల వ్యాపారం కూడా ఈ సారి జోరుగా సాగుతున్నట్లు చిరు వ్యాపారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. రూ.లక్షల్లో అమ్మకాలు సాగుతున్నట్లు సమాచారం.

కిటకిటలాడుతున్న కంగన్‌హాల్స్..

అలంకరణకు కావాల్సిన వస్తుసామగ్రి కంగన్ హాల్స్‌లో విక్రయాలు చేస్తున్నారు. పండుగ వేళ అందంగా ముస్తాబుకావడానికి రకరకాల బొట్టు బిళ్లల నుంచి మొదలుకుని ఇతర అన్ని రకాల అలంకరణ వస్తువులను మహిళలు బేరం చేసి తీసుకువెళ్తున్నారు. అదేమాదిరి ఫుట్‌వేర్ బిజినెస్ కూడా ఆశాజనకంగా జరుగుతున్నట్లు చెబుతున్నారు.

రావణాసుర వధకు ఏర్పాట్లు..

దసరా పండుగ రోజు రావణసూరుడి వధ చేయడం కొంతకాలం నుంచి జరుగుతోంది. బెల్లంపల్లి తిలక్ స్టేడియంలో ఇందుకు సంబంధించి ఏర్పాట్లు చేస్తున్నారు. హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేస్తుండగా, రావణసుర వధ కోసం ప్రత్యేకమైన బొమ్మ తయారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దసరాకు ముందే పండుగ వాతావరణం ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

వ్యాపారం ఆశాజనకంగా ఉంది

ప్రస్తుతం నడుస్తున్న ట్రెండ్‌కు అనుగుణంగా రెడీమేడ్ వస్త్రాలు అమ్మకానికి తీసుకొచ్చాను. వీటి ధరలు సాధారణ స్థితిలో ఉండటంతో నచ్చిన డ్రెస్సెలను కొనుగోలు చేసి తీసుకు వెళ్తున్నారు. అమ్మకాలు ఆశాజనకంగా ఉన్నాయి.

– గణపతి,షాపు యజమాని, బెల్లంపల్లి

నచ్చినవి కొనుగోలు చేస్తున్నం



దసరా పండుగకు బట్టలు పెద్ద ఎత్తున స్టాక్ తెచ్చారు. అన్ని వయస్సుల వారికి అన్ని రకాల బట్టలు అందుబాటులో ఉంచారు. ప్రత్యేకించి చీరలు, చిన్నపిల్లల బట్టలు ఆకర్షణీయంగా ఉన్నాయి. వీటి ధరలు కాస్త ఎక్కువగా అనిపిస్తున్నా నచ్చిన బట్టలను కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నాం.

– వరలక్ష్మి, కొనుగోలుదారు

కాంగ్రెస్ గ్యారంటీలతో మేలు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలోని 3వ వార్డులో శనివారం డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గడపగడపకూ పర్యటించి కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ హామీలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు చేసిందేమీ లేదని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం కర్ణమామిడి, నర్సింగాపూర్ గ్రామాల్లో శనివారం కాంగ్రెస్ పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో గడపగడపకూ వెళ్లి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేసేలా ప్రవేశపెట్టనున్న ఆరు గ్యారంటీ హామీలను ఇంటింటికీ వెళ్తూ అందరికీ వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బొడ్డు శంకర్, బొడ్డు భూమయ్య, రాంచందర్ రావు, చక్రభానురావు, గడ్డం వెంకటేశ్, నల్ల రవి పాల్గొన్నారు.



3వ వార్డులో గ్యారంటీలను వివరిస్తున్న సురేఖ

మద్యం స్వాధీనం

మంచిర్యాలక్రైం: ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమంగా నిలువ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజేందర్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. స్థానిక రంగపేటకు చెందిన ఆవుల తిరుపతి తన ఇంట్లో నిబంధనలకు విరుద్ధంగా నిలువ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకొని, తిరుపతిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు

శ్రీరాంపూర్: నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఆర్కే 7గనిపై మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏరియా జీఎం సంజీవరెడ్డి దంపతులు హాజరయ్యారు. అమ్మవారిని దర్శించుకొని సింగరేణి అంతా సుభీక్షంగా ఉండాలని కోరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి ఇతర నాయకులు కూడా అమ్మవారిని సందర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఏజెంట్ రాముడు, గని మేనేజర్ సాయి ప్రసాద్, సంక్షేమ అధికారి శంతన్‌లు పాల్గొన్నారు.

జన్నారం: మండల కేంద్రంలో దుర్గాయూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శ్రీ దుర్గమాత అమ్మవారి వద్ద భక్తులు హోమం కాల్చారు. అన్నదానం చేశారు. ఎంపీపీ సరోజన, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాసగౌడ్, నర్సగౌడ్, రవీందర్‌రావు అమ్మవారిని దర్శించుకుని పుజలు చేశారు. కార్యక్రమంలో దుర్గయూత్ సభ్యులు అనిల్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అవార్డు గ్రహీతకు ఆత్మీయ సన్మానం

బెల్లంపల్లి: సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు అందుకున్న బెల్లంపల్లి వాసి పెద్దనపల్లి బస్తీకి చెందిన ఓరుగంటి రాధికను శనివారం బీజేపీ శ్రేణులు శాలువాతో ఘనంగా సన్మానం చేసి అభినందించారు. సిద్దిపేటలోని ఎన్సాన్‌పల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో రాధిక పీజీటీగా పనిచేస్తోంది. జాతీయ బహుజన సాహిత్య అకాడమీ రాధికను సావిత్రిబాయి పూలే జాతీయ అవార్డు–2023కు ఎంపిక చేయగా ఇటీవల ఢిల్లీ కేంద్రంగా జరిగిన ఓ ప్రత్యేక కార్యక్రమంలో అవార్డు ప్రదానం చేశారు. సన్మాన కార్యక్రమంలో బీజేపీ పట్టణ కార్యదర్శి కనకం విజయ్, మహిళ మోర్చా పట్టణ అధ్యక్షురాలు ధార కళ్యాణి, నాయకులు రాజశేఖర్, శ్రీనివాస్, వెంకటేష్, సుమలత, రాజు, విశాల్, తిరుపతి, ఆదర్శ్ తదితరులు పాల్గొన్నారు.



రాధికను సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

సీసీ రోడ్డు వేయరూ..!



భీమారం నుంచి సుంకరిపల్లి వెళ్లేందుకు రోడ్డు లేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. చెరువు కట్టపై నుంచి సుంకరిపల్లికి రాకపోకలు సాగించాల్సి వస్తోందని వాపోతున్నారు. కట్టపై సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు. వర్షాకాలంలో కట్టపై బురదగా మారి అధ్వానంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు తీసుకొని సీసీ రోడ్డు నిర్మించి కష్టాల నుంచి విముక్తి కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.


- భీమారం

తొలి ఓటరుదే.. ఇలా!

- ఓటర్ ఐడీలో ఒక పేరు.. జాబితాలో మరోపేరు



ఓటర్ ఐడీకార్డులో మర్సుకోల మల్లేష్



ఓటరు జాబితాలో గంగారపు రమేష్

దండేపల్లి: మంచిర్యాల నియోజకవర్గంలో 2.85లక్షల ఓటర్లు ఉన్నారు. అందులో తొలిఓటరు దండేపల్లి మండలం తాళ్లపేటకు చెందిన మర్సుకోల మల్లేష్. ఇతడిది ఓటరు ఐడీ కార్డులో పేరు కరెక్టుగానే ఉంది. కానీ ఓటరు జాబితాలో మాత్రం గంగారపు రమేష్ అని తప్పుగా ముద్రించారు. ఓటరు ఐడీ, ఓటరు జాబితాలో ఎపిక్ నంబర్ కరెక్టుగానే ఉంది. నియోజకవర్గ తొలి ఓటరుదే ఐడీకార్డులో ఒకలా, జాబితాలో మరోలా పేరు ఉండటం చూస్తుంటే, మిగితా ఓటరు జాబితాల్లో ఇంకెన్ని తప్పులు దొర్లాయో అర్థం కావడం లేదు. ఓటరు జాబితాలను సవరించినా, తప్పులు కనిపించడంపై పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు. అధికారులు ఇప్పటికైనా ఇలాంటి తప్పులను గుర్తించి సవరించాలని పలువురు పేర్కొంటున్నారు.

'భవిష్యత్ బాగుండాలంటే బీఎస్పీని గెలిపించండి'

జన్నారం: ఆదివాసీ గూడేలు బాగుపడాలంటే, ఆదివాసీ గిరిజనుల భవిష్యత్ మారాలంటే బహుజన రాజ్యం రావాలని ఖానాపూర్ నియోజకవర్గ బీఎస్పీ అభ్యర్థి రాథోడ్ బన్సీలాల్ పేర్కొన్నారు. మండలంలోని అలీనగర్, దొంగపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి బీఎస్పీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రవెల్లి ఆదివాసీ అమరవీరుల స్థూపం సాక్షిగా కాంగ్రెస్ పార్టీ గిరిజనులను మోసం చేసిందన్నారు. టైగర్ జోన్ పేరిట ఆదివాసీ కుటుంబాలను ఆగం చేసిందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరిట అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పార్టీ ప్రజలను మోసం చేసిందన్నారు. యువకుల, విద్యార్థుల భవిష్యత్ బాగుపడాలంటే వచ్చే ఎన్నికల్లో బీఎస్పీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో జన్నారం మండల బీఎస్పీ నాయకులు కత్తెరపాక రవీందర్, రేఖ్యానాయక్, కళ్యాణ్, భీమన్న, వినోద్, అరుణ్, సతీశ్ పాల్గొన్నారు.



అలీనగర్ ఎన్నికల ప్రచారంలో బన్సీలాల్

'విద్యార్థుల రాజకీయ పార్టీ'లో చేరిక

మంచిర్యాలటౌన్: విద్యార్థులు, నిరుద్యోగుల కోసం పుట్టిన 'విద్యార్థుల రాజకీయ పార్టీ'లో మంచిర్యాలకు చెందిన గొర్లపల్లి సురేశ్ శనివారం హైదరాబాద్‌లో చేరారు. ఈ సందర్భంగా సురేశ్ మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు వస్తాయనుకుంటే కల్వకుంట్ల కుటుంబానికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని, మంచి ఆశయాలు, బలమైన సిద్ధాంతాలు కలిగిన పార్టీగా విద్యార్థుల రాజకీయ పార్టీ ఏర్పడిందన్నారు. ఎన్నికల సంఘం బ్యాట్ గుర్తును కేటాయించగా, మంచిర్యాల నియోజకవర్గం నుంచి తాను పోటీ చేయనున్నట్లు తెలిపారు.



పార్టీలో చేరుతున్న గొర్లపల్లి సురేశ్

సూపర్‌బజార్‌లో బతుకమ్మ సంబురాలు



ఓసీలో పూజల్లో పాల్గొన్న జీఎం, అధికారులు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి సూపర్ బజార్‌లో శనివారం సాయంత్రం బతుకమ్మ సంబురాలను నిర్వహించారు. సూపర్‌బజార్ మహిళా ఉద్యోగులు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. డీజీఎం పర్సనల్ శ్యాంసుందర్, సూపర్‌బజార్ డివిజనల్ మేనేజర్ సుదర్శన్, బ్రాంచి మేనేజర్ సుదర్శనం, మాధవరావు, ప్రసాద్ తదదితరులు పాల్గొన్నారు. కాగా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఓసీ ఆవరణలో గల ఆలయంలో జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఏరియా జీఎం మనోహర్ దంపతులు, ఎస్ఓటు జీఎం రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బతుకమ్మ ఆటాపాట కార్యక్రమం

నస్పూర్: పట్టణ పరిధిలోని కృష్ణాకాలనీ శాంతి స్టేడియంలో సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నేడు బతుకమ్మ ఆటపాట, ఫ్యామిలీ డే కార్యక్రమం నిర్వహించనున్నట్లు శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి యాజమాన్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఏరియాలోని మహిళలు బతుకమ్మలతో ఆదివారం సాయంత్రం 6గంటలకు శాంతి స్టేడియానికి హాజరుకావాలని యాజమాన్యం తెలిపింది. బతుకమ్మ పోటీలలో గెలుపొందిన వారికి ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి దంపతుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేయనున్నట్టు ప్రకటించారు. కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



చెన్నూర్ కొత్త బస్టాండ్‌లో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు



చెన్నూర్ అస్నాద చౌరస్తాలో బంతిపూలు కొనుగోలు చేస్తూ...



చెన్నూర్ పాత బస్టాండ్ వద్ద సీతమ్మపూలు కొనుగోలు చేస్తూ..

పూలకు భలే డిమాండ్

చెన్నూర్: తెలంగాణ ఆడపడుచుల పెద్ద పండగ సద్దుల బతుకమ్మ. బతుకమ్మ వేడుకలను ఎనిమిది రోజులు జరుపుకున్న మహిళలు తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మ సంబురాలు జరుపుకుంటారు. ఆదివారం సద్దుల బతుకమ్మకు కావాల్సిన రంగు రంగుల పూలను సమాకూర్చుకునే పనిలో నిమగ్నమయ్యారు. స్థానిక కొత్త బస్టాండ్, అస్నాద్ రోడ్డు, కూరగాయాల మార్కెట్, రాజీవ్‌రోడ్డు, గాంధీ చౌక్‌లలో వివిధ రకాల పూల వ్యాపారం జోరుగా సాగుతుంది. బతుకమ్మలను పెద్దగా పేర్చేందుకు ఒక్కో మహిళ రెండు నుంచి మూడు కిలోల బంతి, చామంతి, సీతమ్మ, తంగెడు రకాల పూలను కొనుగోలు చేస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు బంతిపూలు కిలో రూ.40పలుకగా శనివారం కిలో బంతి పూలు 60కి చేరింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పూల వ్యాపారం బాగుందని వ్యాపారులు అంటున్నారు.

ఏర్పాట్లు పూర్తి..

స్థానిక జగన్నాథా లయం, మహంకాళివాడ, బలిజవాడ, కొత్తగూడెం, ఆదర్శనగర్ కాలనీ, గెర్రెకాలనీ, కొటబొగుడ, కుమ్మరికుంట, రజకవాడలలో సద్దుల బతుకమ్మలు ఆడేందుకు నిర్వహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వీధి లైట్లు, మైక్ సెట్లను అమరుస్తున్నారు. సద్దుల బతుకమ్మలను గతంలో మహిళలు రాత్రి పది గంటల వరకే ఆడి నిమజ్జనం చేసే వారు. గతేడాది తెల్లవారు జామునా బతుకమ్మలు నిమజ్జనం చేయడం గమన్హారం.

అ'పూర్వ' సమ్మేళనం

మంచిర్యాల పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ పాఠశాల 2003-2004కు చెందిన పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు శనివారం ఒకే చోట కలిశారు. 20ఏళ్ల క్రితం చదువుకున్న విద్యార్థులు ఒకే చోట చేరి, ఆత్మీయ పలకరింపులు, మధుర స్మృతులు తలుచుకుంటూ ఆనందంగా గడిపారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, ఆటలు ఆడుతూ, పాటలు పాడుతూ సందడి చేశారు.

- మంచిర్యాలటౌన్

